క్లుప్తంగా

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా 27న ర్యాలీ

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలను పెంచి ఏకంగా రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల సమయంలో కరెంట్ చార్జీలు పెంచమని చంద్రబాబు పదే పదే ప్రచారం చేసి అధికారంలోకి రాగానే పెంచడం దారుణమన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు ఈనెల 27న మడకశిరలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వానికి రైతుల సంక్షేమం పట్టదా?

గుడిబండ: కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించి రైతులను కష్టాలకు గురిచేస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన రైతులకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లకు పైన కావస్తున్నా రూ.20 వేల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లోకి జమ చేయలేదన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

హైవేపై 'ఫేస్ వాష్ అండ్ గో'



ముఖం కడిగేందుకు డ్రైవర్‌కు నీళ్లు ఇస్తున్న పోలీసులు

పెనుకొండ రూరల్/సోమందేపల్లి: పెనుకొండ, సోమందేపల్లి 44వ నంబర్ జాతీయ రహదారిపై ఎస్‌ఐలు రాజేష్, రమేష్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా రహదారిపై వెళ్తున్న వాహనదారులను ఆపి నీటిని అందించారు. మోహం శుభ్రం చేసుకున్న తర్వాత వాహనాలను నడపాలని డ్రైవర్లకు సూచించారు.

సమస్యలపై పది అర్జీలు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారానికై పది ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఆర్థికవేత్తలుగా ఎదగాలి



పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం

హిందూపురం: 'దేశ ఆర్థిక స్థితిని బలపరిచే వ్యాపార వేత్తలుగా ఎదగాలి. మెరుగైన ఉద్యోగ అవకాశాలు సాధించి దేశాభివృద్ధికి తోడ్పడాలి' అని ఎస్‌డీజీఎస్ కళాశాల కమిటీ సెక్రటరీ కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఎస్‌డీజీఎస్ ఎంబీఏ కళాశాలలో ఫ్రెషర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారం రోజులుగా వివిధ అంశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



ఎల్‌కే పల్లి ప్రాథమిక పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్‌కే పల్లి, ఎల్‌కే పల్లి వడ్రహట్టి తదితర ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పర్యవేక్షించారు. ఎండీఎం నిర్వాహకులు తప్పని సరిగా మెను పాటించాలని సూచించారు.

రెవెన్యూ సదస్సుకు పది అర్జీలు

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామ సచివాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై పది అర్జీలు అందినట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు.

నష్టాలబాటలో మిర్చి రైతులు



రైతులు సాగు చేసిన మిరప పంట

- క్వింటా రూ.25 వేల నుంచి రూ.14 వేలకు తగ్గుదల
- పంటకు సోకుతున్న రోగాలతోనూ నష్టం
- ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలంటున్న అన్నదాతలు

పెనుకొండ: నిన్న మొన్నటి వరకూ మిరప సాగు అంటే రైతన్నలు మక్కువ చూపారు. వాణిజ్య పంట కావడం గిట్టుబాటు ధరలు వస్తుండటంతో పంట సాగుకు అత్యంత ఉత్సాహం చూపారు. అయితే మార్కెట్లో మిరప ధరలు పడిపోవడంతో అన్నదాతలు డీలా పడ్డారు. దీనికి తోడు పంటకు సోకుతున్న రోగాలతో కుదేలవుతున్నారు. మిరప సాగుకు స్వస్తి పలికి వరి, రాగి, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేస్తున్నారు.

రూ.25 వేల నుంచి రూ.14 వేలకు..

మార్కెట్‌లో 2023 సంవత్సరంలో మొదటి రకం క్వింటాలు ఎండు మిరప రూ.25 వేలు పలికింది. రెండో రకం రూ.17 వేలు, మూడో రకం రూ.14 వేల వరకూ పలికేది. అయితే ఆరు నెలలుగా క్వింటాలు మొదటి రకం ఎండు మిరప ధర రూ. 12 వేల నుంచి 14 వేలు ధర పలుకుతోంది. రెండో రకం రూ.9 నుంచి 10 వేలు, మూడో రకం రూ.7 వేల నుంచి 8 వేలు పలుకుతోంది. సగానికి పైగా ధరలు పడిపోయాయి.

ఎకరాకు రూ.60 వేలు

ఎకరా భూమిలో మిరప పంట సాగు చేయాలంటే రైతుకు రూ.50 వేల నుంచి రూ. 60 వేల వరకూ ఖర్చు వస్తుంది. అయితే ప్రస్తుతం పంట చేతికొచ్చి మిరపను అమ్మిన తర్వాత రూ. 25 వేలకు పైగా నష్టం వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప కాయను విడిపించడానికి కూలి వస్తే రోజుకు రూ.300 కూలి ఇవ్వాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

దళారుల రాజ్యం...

మిరప పంట నూర్పిడి అనంతరం ఎండు మిర్చిని హిందూపురంలోని మార్కెట్‌కు తీసుకెళితే అక్కడ దళారులు ఏకమై విపరీతంగా ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. మిరపకు గుంటూరు, హిందూపురం మినహా ఎక్కడా మార్కెట్లు లేకపోవడంతో హిందూపురం మార్కెట్లో దళారులు ఆడిందే ఆటగా సాగుతోందంటున్నారు. దీంతో గుంటూరుకు వెళ్లలేక విధిలేని పరిస్థితిలో రైతులు ఎండు మిరపకాయను హిందూపురంలోనే విక్రయించాల్సి వస్తోంది.

మిరపకు రోగాలు

ధరలు తగ్గడంతో ఇబ్బందులు పడుతున్న మిరప రైతులకు రోగాల ఘాటు మరింత భారంగా మారింది. రసం పీల్చే పురుగుతో పాటు నల్లి పురుగు, తామర పురుగు ఇతర వైరస్ రోగాలతో మిరప ఎక్కడికక్కడ దెబ్బతింటోంది. చెట్టు ఎదుగుదల కోల్పోయి, దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా వెనక్కు రావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

ఎగుమతి నిలిపేసిన కేంద్రం

గత యేడాది నుంచి ఎండు మిరపను కేంద్ర ప్రభుత్వం ఎండు మిరప ఎగుమతిని నిలిపి వేసింది. దీనివల్లే మిరప ధరలు పూర్తిగా పడిపోయాయని, భవిష్యత్తులో భారీ ఎత్తున పంట సాగు తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు రోగాలు సోకడంతో పంటను సాగు చేయలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకుంటేనే వాణిజ్య పంట అయిన మిరప సాగు బతికి బట్టకడుతుందని, లేకపోతే మిరప సాగు ఈ ప్రాంతంలో కనిపించదంటున్నారు.

400 ఎకరాలకు పైగా...

పెనుకొండ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రైతన్నలు మిరప సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలోని మావటూరు, సుద్దబట్లపల్లి, మేకలపల్లి, బ్రహ్మసముద్రం, మండ్లి, రూకలపల్లి, ఈదులబళాపురం, జులుకుంట, ముద్దపుకుంట, పరిగి మండలం కొత్తపల్లి, నరసాపురం, ధనాపురం, శీగిపల్లి, తురకలాపట్నం, కోగిర, కంబాలపల్లి, పెదకోడిపల్లి, తిమ్మాపురం, కలిపి, మరువపల్లి తదితర గ్రామాల్లో 400 ఎకరాలకు పైగా పంట సాగులో ఉంది. కానీ నేడు నెలకొన్న అయోమయ పరిస్థితులు నెలకొనడంతో దీని ప్రభావం నర్సరీలపై సైతం పడిందనే చెప్పవచ్చు.

కన్నీరే మిగిలింది



మిరప సాగే మాకు ప్రాణాధారం. మా పరిసర గ్రామాల్లో ఎంతోమంది రైతులు మిరప సాగు చేస్తున్నారు. ధరలు పడిపోవడం, పంటకు రోగాలు సోకడంతో మిరప సాగు రైతాంగాన్ని కన్నీరు పెట్టిస్తోంది. ఆర్నెళ్లకు ముందు వరకూ ప్రతి రైతు లక్షల్లో లాభాలు పొందారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. హిందూపురం మార్కెట్లో దళారులు కుమ్మక్కై తక్కువ ధరలకు మిరపను కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారు.

– శ్రీనివాసులు, మండ్లి, సోమందేపల్లి మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



ఎన్నో అవస్థల మధ్య మిరప సాగు చేశాము. క్వింటా ధర రూ. 25 వేలు ఉండేది. కాని నేడు రూ.14 వేలు అని అంటుంటే వణుకుపుడుతోంది. రైతులు వ్యవసాయం చేయడమే గగనంగా మారుతున్న పరిస్థితుల్లో ధరలు ఇంతగా పడిపోవడం వ్యవసాయానికి గడ్డుకాలం. మిరపకు గిట్టుబాటు ధరలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– కార్తీక్‌రెడ్డి, కొత్తపల్లి, పరిగి మండలం

సకాలంలో మందులు కొట్టాలి



మిరప ధరలు తగ్గుదలతో రైతులు సాగుకు దూరమవుతున్నారు. ఉన్నఫళంగా ధరలు పడిపోవడం రైతన్నను ఆందోళనకు గురిచేస్తోంది. మిరపను ఆశిస్తున్న రోగాలతో రైతులు సతమతమవుతున్నారు. సకాలంలో నిర్దేశించిన మందులు స్ప్రే చేయాలి. ఏమైనా అనుమానాలు ఉంటే హార్టికల్చర్ అధికారులను సంప్రదించాలి.

– చంద్రశేఖర్, జిల్లా హార్టికల్చర్ అధికారి

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

- జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో జడ్జి కంపల్లె శైలజ

హిందూపురం అర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. ఇటీవల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌డీజీఎస్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి సోమవారం జడ్జి శైలజ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల్లో జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. చదువు మానవ మనుగడకు ఎంతో ప్రధానమన్నారు. అదే సమయంలో ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాలపై ప్రతి విద్యార్థి కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై ఎంతో మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం విజేతలుగా నిలిచిన షమీమ్‌తాజ్, నందిని, హేమలత, పావని, ముబారక్, అంజలీలకు, మానస, జయలక్ష్మీ, లావణ్య, బిందు, పూజిత, పల్లవిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, కళావతి, సంతోషికుమారి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

చీకటి ఒప్పందాల కోసం పార్టీని విమర్శిస్తారా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుకొండ రూరల్: చీకటి ఒప్పందాల కోసం వైఎస్సార్‌సీపీని విమర్శించడం తగదని కురుబవాండ్లపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఎర్రమంచి (కురుబవాండ్లపల్లి) సర్పంచ్ నాగమూర్తి ఆదివారం సాయంత్రం మంత్రి సవిత సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం కూటమి ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేస్తుందని, అభివృద్ధి కోసమే పార్టీ మారాను అన్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్వార్థ ప్రయోజనాలు, చీకటి ఒప్పందాల కోసం పార్టీ మారిన సర్పంచ్ నాగమూర్తి వైఎస్సార్‌సీపీని విమర్శించడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు నెత్తిన పెట్టుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపిస్తే, స్వార్థం కోసం పార్టీని వదిలి వెన్నుపోటు పొడిచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి జరగకపోతే కియా, అనుబంధ పరిశ్రమలు నుంచి వసూలు చేసిన పన్నులు ఏమయ్యాయని ప్రశ్నించారు. పంచాయతీకి వచ్చిన నిధులు ఎంత ? ఖర్చు చేసిన నిధులు ఎంత ప్రజలకు చెప్పాలన్నారు. ఒకరిద్దరు పార్టీ మారినంత మాత్రాన వైఎస్సార్‌సీపీకి వచ్చే నష్టం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు చెన్నకేశవులు, నాగేంద్ర, నరసింహులు, నరసింహమూర్తి, కె.ఆంజనేయులు, నరసింహులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీఅండ్‌ఐజీ చర్చి వార్షికోత్సవం



భక్తి గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

హిందూపురం: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీఅండ్ ఐజీ చర్చి 20వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగానే ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వృద్ధులకు దుప్పట్లు పంచిపెట్టారు. చర్చి ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, కార్యదర్శి పాల్, పాస్టర్ కిరణ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సోమందేపల్లి: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, కుటుంబ సభ్యులను కూడా అప్రమత్తం చేయాలని ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. సోమవారం చాలకూరులో సైబర్, రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రగ్స్ నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన వివరించారు. హెచ్‌ఎం రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదాతలకు సన్మానం

పావగడ: రైతు బాంధవుడు, మాజీ ప్రధాని చరణ్ సింగ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన రైతు దినోత్సవం సందర్భంగా స్థానిక హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ రైతులను సన్మానించారు. కొత్తూరు గంగమ్మ, కెంచమ్మనహళ్లి కెంచమ్మ, కడపలకెరె ధనలక్ష్మి, వెంకటాపురం రామాంజినప్ప, లింగదహళ్ళి హరీశ్‌రెడ్డి, జయమ్మ, సద్దక్‌లను సన్మానించారు. కార్యక్రమంలో మానం శశికిరణ్, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

అద్దె బకాయిలు చెల్లించాలని ధర్నా

మడకశిర: పట్టణంలోని వివిధ నాలుగు చక్రాల వాహనాల డ్రైవర్లు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలకు స్థానిక అధికారులు వాహనాలను అద్దెకు తీసుకున్నారని, రూ.5 లక్షల వరకూ చెల్లించాల్సి ఉన్నా ఇంత వరకూ బకాయిలు చెల్లించడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ కరుణాకర్‌కు డ్రైవర్ల సంఘం నాయకులు వినతిపత్రం అందించారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

అమరాపురం: మండల పరిధిలోని కాచికుంట గ్రామానికి చెందిన దళిత కులస్తులు తమ గ్రామ బస్టాండ్ సర్కిల్‌లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలంటూ సోమవారం నిరసనకు దిగారు. అధికారులకు ఇప్పటికే వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్థలం కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

హిందూపురం టౌన్: డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దిలీప్, మంజునాథ్, దర్శన్, గోవిందు, తిప్పేష్ తదితరులు పాల్గొన్నారు.

కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

మడకశిర: పట్టణంలోని వ్యాపారులు, ప్రముఖులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ రాగిరి రామయ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వ్యాపారులు, ప్రముఖులతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. చోరీల నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం మండలంలోని గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులతో కూడా సమావేశమై శాంతి భద్రలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

మోడల్ పేపర్లు పంపిణీ

రొద్దం: మండల పరిధిలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో దాత, స్కూల్ కమిటీ చైర్మన్ గోవిందప్ప చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు సానిపల్లి గంగాధర్, పోతులయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



పీజీఎస్ తండా పాఠశాలలో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

మడకశిర రూరల్: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో గణితశాస్త్ర దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గణిత పితామహుడు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ భాస్కర్ మాట్లాడుతూ రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

విజ్ఞానంతో ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న వేణుగోపాల్

పరిగి: విజ్ఞానంతో ఉన్నత శిఖరాలను చేరవచ్చని ప్రముఖ మోటివేటర్ లక్ష్మీపురం వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో సోమవారం ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు అధ్యక్షతన విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏకాగ్రత, మానసిక ఉల్లాసంతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని, చదువుకునే విద్యార్థులకు ఇది చాలా అవసరమన్నారు. పాఠశాలకు ఉన్న ఇమేజ్‌ను కాపాడుతూ నేటికీ ఏపీఆర్‌ఎస్ కొడిగెనహళ్లి పాఠశాల రాష్ట్ర స్థాయిలో గుర్తింపును కొనసాగిస్తుండటం ఆనందాన్నిస్తోందన్నారు.

ఘనంగా గణితశాస్త్ర దినోత్సవం

ఏపీఆర్‌ఎస్‌లో సోమవారం గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు గణిత శాస్త్రంలోని పలు అంశాలపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ శేషాచలం, గణితశాస్త్ర ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, రామాంజినమ్మ, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

హిందూపురం టౌన్: పట్టణంలోని చైతన్య పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టేకులోడుకు చెందిన రైతు శంకర్‌రెడ్డి, సూగూరుకు చెందిన గంగాధర్ తదతర రైతులను పాఠశాలలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఏఓ ప్రభాకర్‌రెడ్డి, డీన్ నాగరాజు, బ్యాచ్ ఇన్‌చార్జ్ బీటీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ



గుడిబండ: వివిధ వేషధారణలతో ఊరేగింపులో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

గుడిబండ: మండల కేంద్రంలో అయ్యప్పభక్తి మండలి సభ్యులు, గురుస్వాములు రాజు, లోకేష్ తదితరులు ఆధ్వర్యంలో మండల పూజను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం మాలధారులు వివిధ వేషధారణలో ఊరేగింపులో పాల్గొన్నారు. తర్వాత పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిబంధనలు పాటించాలి



తూకపు రాళ్లకు సీల్ వేస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్: రేషన్ పంపిణీలో నిబంధనలు తప్పక పాటించాలని హిందూపురం లీగల్ అండ్ మెట్రాలజీ అధికారి శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యాప్తంగా 37 ప్రభుత్వ చౌక ధాన్యపు దుకాణాల్లో ఉపయోగించే స్కేళ్లకు ప్రభుత్వ ముద్రలు వేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ ప్రభావతి, డీలర్లు పాల్గొన్నారు.

పావగడలో జేడీఎస్ పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు

పావగడ: తాలూకా వ్యాప్తంగా నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్ పాలన వైఫల్యాలను ఎండ గడుతూ తిమ్మరాయప్ప నేతృత్వంలో జేడీఎస్ శ్రేణులు సోమవారం పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగానే తాలూకా కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందించారు.జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు ఎన్‌ఏ ఈరణ్ణ, జిల్లా అధ్యక్షుడు ఆర్సి అంజినప్ప, సీనియర్ నేత తిమ్మారెడ్డి, సొగడు వెంకటేష్, గంగాధర నాయుడు, సాయిసుమన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

పెనుకొండ: పట్టణ సమీపంలోని త్రిపుర రిసార్ట్‌లో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. గుట్టూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1983–84లో 10వ తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మరణించిన ఉపాధ్యాయులు, స్నేహితులకు శ్రద్ధాంజలి ఘటించారు.



న్యూ జెరూసెలెం చర్చి ముందు ఇలా..

క్రిస్మస్ కాంతులు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని చర్చిలు ముస్తాబు అయ్యాయి. సీఅండ్‌ఐజీ కాంపౌండ్ చర్చి, న్యూజెరూసెలెం చర్చి, లక్ష్మీపురం బైబిల్ మిషన్ తదితర ప్రార్థనా మందిరాలను విద్యుత్‌దీపాలు, స్టార్లు, క్రిస్మస్ ట్రీలతో అలంకరించారు.

– హిందూపురం:



విద్యుత్ దీపాలంకరణలో సీఅండ్‌ఐజీ మిషన్ చర్చి



ముస్తాబైన చర్చి